క్లుప్తంగా

వైభవంగా రావణసేవ



మనుబోలు: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి రావణసేవను వైభవంగా నిర్వహించారు. సంగమేశ్వరుడి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి రావణుడిపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. పెంగాణి రామకృష్ణారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అయ్యప్ప సన్నిధిలో 15న విషుక్కణి

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో విషుక్కణిని శనివారం నిర్వహించనున్నామని అయ్యప్ప సేవా సమాజ అధ్యక్షుడు శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పస్వామి నిర్మాల్య దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు. ఆలయాన్ని ఫలాలతో అలంకరించనున్నామని చెప్పారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బోడిగాడితోటలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై నవాబుపేట పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. పేకాటాడుతున్న 11 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2100 నగదును స్వాధీనం చేసుకున్నారు.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్): కనుపర్తిపాడుకు చెందిన రామిరెడ్డి (85) మంగళవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11093 నంబర్లను సంప్రదించాలని పెద్దాస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్ కోరారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్, ఐ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని కేజీబీవీల్లో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 12 కేజీబీవీలు ఉన్నాయని, వివరాలకు సమగ్రశిక్ష కార్యాలయంలోని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

బంగారు ఆభరణాల దుకాణంలో చోరీ

నెల్లూరు(క్రైమ్): దంపతుల ముసుగులో ఇద్దరు నిందితులు ఓ జ్యువెలరీస్ దుకాణంలో ఉంగరం, కాళ్ల పట్టీలను అపహరించుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. పణతులవారివీధిలో నివాసం ఉంటున్న లక్ష్మయ్య తన ఇంటి కింది భాగంలో బంగారు ఆభరణాల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. దంపతుల ముసుగులో ఇద్దరు నిందితులు దుకాణానికి ఈ నెల ఆరున వచ్చారు. వారి అభ్యర్థన మేరకు బంగారు ఉంగరాలు, కాళ్ల పట్టీలను చూపించారు. లక్ష్మయ్య కళ్లుగప్పిన నిందితులు రెండు జతల కాళ్ల పట్టీలు (280 గ్రాములు), అర సవర బంగారు ఉంగరాన్ని అపహరించారు. డిజైన్లు నచ్చలేదని చెప్పి అక్కడి నుంచి జారుకున్నారు. కొద్ది సేపటికి పట్టీలు, బంగారు ఉంగరం కనిపించకపోవడంతో సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. చోరీ దృశ్యాలు కనిపించాయి. నిందితుల కోసం చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో మార్కెటింగ్ శాఖ పరిధిలో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిధులను కేటాయించనున్నామని మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని మార్కెటింగ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెటింగ్ శాఖ జిల్లా బడ్జెట్‌కు అవసరమైన నిధులపై ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. మార్కెటింగ్ శాఖ గోదాముల నిర్మాణాలను చేపట్టాలన్నారు. ఏ ప్రాంతానికి ఎంత బడ్జెట్ అనేది త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. ఏడీ అనిత పాల్గొన్నారు.

కోర్టు విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు (లీగల్): హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వర్లుపై బాలాయపల్లి ఎస్సై, కానిస్టేబుళ్ల అనుచిత ప్రవర్తనకు నిరసనగా కోర్టు విధులను గురువారం బహిష్కరించనున్నామని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కోర్టు విధులను బహిష్కరించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



చిన్నారులకు డిపాజిట్ బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

విడవలూరు(కోవూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం బ్యాంకుల్లోని పొదుపు రుణాలను వైఎస్సార్ ఆసరా పథకం కింద విడతల వారీగా చెల్లిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరులోని సచివాలయం–1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయం–1 పరిధిలోని పొదుపు సభ్యులకు వైఎస్సార్ ఆసరా కింద రూ.7.20 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఏ విధంగా మోసం చేశారో ప్రజలు గుర్తించాలన్నారు. మళ్లీ మోసపు మాటలతో ప్రజల వద్దకు వస్తున్నారని, వారిని తిప్పి కొట్టేందుకు అక్కాచెల్లెమ్మలు సిద్ధంగా ఉండాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలోని 54 సచివాలయాల పరిధిలో 62,570 గడపలను సందర్శించామని తెలిపారు. మిగిలిన గడపలను త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్రంలోనే కోవూరు నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలువుతామన్నారు. సచివాలయం–1 పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.10 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. అందుకే ఏ గడపకు వెళ్లిన ప్రజలు ఆదరిస్తున్నారన్నారు.

ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు సాయం

ఇటీవల విడవలూరులోని కామాక్షినగర్‌కు చెందిన వలంటీర్ ముంగర సుధారాణి భర్త అనారోగ్యంతో మృతి చెందారు. సుధారాణి కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించారు. ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా వలంటీర్ పిల్లలు ముంగర స్ఫూర్తి, ముంగర వెంకటగణేష్‌కు ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున నగదు సాయం చేశారు. పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు నగదు డ్రా చేయకుండా విడవలూరులోని కెనరా బ్యాంకులో నగదు డిపాజిట్ చేసి బాండ్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి , శ్రీహరిరెడ్డి, మాజీ ఎంపీపీ ఒగు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ తుమ్మ లక్ష్మయ్య, వీఓఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి సంపూర్ణమ్మ, సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూసీ గోదాములను సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో ఎస్‌డబ్ల్యూసీ సిబ్బంది

మనుబోలు: జట్లకొండూరు సమీపంలోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్‌డబ్ల్యూసీ) గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ గోదాముల మేనేజర్ కుమార్ సూచించారు. మడమనూరుకు చెందిన కొండూరు జనార్దన్‌రెడ్డి అనే రైతు ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో సుమారు 400 పుట్ల ధాన్యాన్ని బుధవారం నిల్వ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కుమార్ మాట్లాడుతూ గోదాములో ధాన్యం నిల్వకు 75 కేజీల బస్తాకు నెలకు గరిష్టంగా రూ.8 వంతున అద్దె తీసుకుంటామని తెలిపారు. నిల్వ ఉంచిన ధాన్యం పాడవకుండా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిల్వ ఉంచిన ధాన్యానికి బ్యాంకుల నుంచి రైతులు రుణం పొందవచ్చని తెలిపారు. రైతులను గోదాములను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా రైతు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ధాన్యం నిల్వకు అవకాశం లేక రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకునేవారని తెలిపారు. మంత్రి కాకాణి చొరవతో ఎస్‌డబ్ల్యూసీ గోదాముల నిర్మాణం పూర్తవడంతో ఎంత ధాన్యమైనా తక్కువ ఖర్చుతో నిల్వ చేసుకునే వెసులుబాటు లభించిందన్నారు. రైతుల తరఫున కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట ఎస్‌డబ్ల్యూసీ ఆర్ఎంటీ రమణయ్య, మేనేజర్ కుమార్, డీఈ ఆనందర్‌రెడ్డి, జేఏ విజయ్‌కుమార్, జట్లకొండూరు ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం, తదితరులు ఉన్నారు.

సైన్స్ పరీక్షపై అవగాహన అవసరం



మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు: పదో తరగతి విద్యార్థులకు సైన్స్ పరీక్షపై అవగాహన అవసరమని ఎంఈఓ జీ వసంతకుమారి అన్నారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఉదయం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు సైన్స్ పరీక్షపై సూచనలు చేశారు. తొలిసారిగా ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్ట్‌లను కలిపి ఒకే పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1 నుంచి 16వ ప్రశ్న వరకు ఫిజికల్ సైన్స్, 17 నుంచి 33వ ప్రశ్న వరకు బయోలాజికల్ సైన్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని వివరించారు. ఓఎంఆర్ జవాబు పత్రాలు వేర్వేరుగా ఇస్తారని చెప్పారు. ఫిజికల్ సైన్స్ ఓఎమ్మార్ షీట్‌పై కోడ్–19, పీ–1, బయోలాజికల్ సైన్స్ ఓఎంఆర్‌పై కోడ్–20, పీ.2 అని ఉంటుందని తెలిపారు. వాటిని గుర్తించుకుని దేనికి కేటాయించిన ఓఎమ్మార్ షీట్‌లో ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన జవాబులే రాయాలని సూచించారు. ఈ విషయాన్ని పరీక్ష సమయంలోనూ విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఇన్విజిలేటర్లను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

● వేసవిలో మంచుతెర



బుధవారం ఉదయం 8 గంటల సమయంలో విడవలూరు పొలాల్లో కురుస్తున్న పొగమంచు

ఏప్రిల్ మాసంలోనూ పొగ మంచుకురుస్తోంది. పగటి వేళ ఎండలు మండుతున్నా వాతావరణంలో నెలకొన్న మార్పులతో రాత్రి వేళల్లో మంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. –కోవూరు

ఉచిత వైద్యశాల ప్రారంభం



నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రోటరీ క్లబ్ నెల్లూరును రోటరీ గవర్నర్ నాగ సతీష్‌బాబు బుధవారం సందర్శించారు. ఏనుగు పట్టాభిరామిరెడ్డి ట్రస్ట్‌లో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశాల, రోటరీ క్లబ్ ఆఫీస్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ రూమ్‌ను పూర్వ రోటరీ గవర్నర్ భరత్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను రోటరీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి మాట్లాడారు. గైనకాలజిస్ట్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 వరకు వైద్యసేవలను అందించి, మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నారని చెప్పారు. రోటరీ క్లబ్ నెల్లూరు సెక్రటరీ సమీ ఫుల్లా, జాయింట్ సెక్రటరీ ఉదయభాస్కర్, తిరుపతి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి పెయింటర్ మృతి

నెల్లూరు(క్రైమ్): పెయింట్ పనులు చేస్తూ అపార్ట్‌మెంట్ పైనుంచి కిందపడి పెయింటర్ మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. దగదర్తి మండలం రామకృష్ణాపురానికి చెందిన యేసుపాదం (52), మేరీ దంపతులకు ఇద్దరు పిల్లలు. తనకు వరుసకు సోదరుడైన విజయ్‌కుమార్ వద్ద పెయింట్ పనులు చేసుకొని యేసుపాదం జీవనం సాగిస్తున్నారు. నవాబాల దుర్గాదేవి దేవస్థాన సమీపంలో నిర్మిస్తున్న ఐదంతస్తుల అపార్ట్‌మెంట్‌లో పెయింట్ పనులు చేస్తున్నారు. ఐదో అంతస్తు పైనుంచి తాడు కట్టుకొని పెయింట్ వేస్తుండగా, ప్రమాదవశాత్తూ ఆయన కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను హుటాహుటిన మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం సహచరులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆయన మృతి చెందారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు అందింది. మృతదేహాన్ని ఎస్సై సైదులు పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇంకుడు గుంతలకు నిధుల మంజూరు

కొడవలూరు: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంకుడు గుంతలు(సోక్ పిట్స్) నిర్మాణానికి రూ.6వేలు మంజూరు చేస్తున్నట్లు హౌసింగ్ ఏఈ పీ సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకుడు గుంత నిర్మాణంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇళ్లలోని వృథానీటిని రోడ్లపైకి వదిలేయడం వల్ల మురుగు సమస్య తలెత్తుతుందన్నారు. అందువల్ల డ్రైనేజీ సౌకర్యం లేని కాలనీల్లోని ఇళ్ల లబ్ధిదారులు విధిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి అభినందన



నెల్లూరు (టౌన్): ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లాకు చెందిన పలువురు నేతలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు బుధవారం అభినందించారు. విద్యాసంస్థలకు అండగా ఉంటూ.. ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

శరవేగంగా శ్రీవారి రథం నిర్మాణం



రథం తయారీ పనుల్లో నిమగ్నమైన కళాకారులు



మెరుగులు దిద్దుకుంటున్న రథం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేవుట్‌లోని శ్రీలక్ష్మీగోదానమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రథం తయారీ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతేడాది సుమారు రూ.3.50 కోట్లతో నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శిలాప్రతిష్ట చేశారు. శ్రీవారి రథోత్సవం కోసం ప్రత్యేకంగా బలాస టేకుతో రథం తయారీకి ఆలయ నిర్వాహకులు గతేడాది అక్టోబర్ 28న అంకురార్పణ చేశారు. రథం తయారీకి రూ.40 లక్షల వరకు వ్యయం అవుతుందని అంచనా వేయగా, దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. పట్టణ వీధుల్లో శ్రీవారు రథంపై ఊరేగితే సకల శుభాలు చేకూరుతాయనే నమ్మకంతో దాతలు విరాళాలు అందజేసేందుకు ముందుకొస్తున్నారు. బలాస టేకు కుంట రూ.7 వేలు కాగా, దాతలు కుంటల వారీగా తమ విరాళాలను ప్రకటించి అందజేస్తున్నారు. రథాన్ని 23 అడుగుల ఎత్తు, 13 అడుగుల వెడల్పు, 15 అడుగుల పొడవుతో 350 కుంటల బలాస టేకుతో తయారు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గూడూరుకు చెందిన తయారీదారులు రథాన్ని రూపొందిస్తున్నారు.

అర్హులకు ఉచిత న్యాయసాయం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసులునాయక్

బుచ్చిరెడ్డిపాళెం: అర్హులైన వారికి ఉచితంగా న్యాయసాయాన్ని అందించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. వడ్డిపాళెంలోని ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీ యామిని ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదలకు ఉచిత న్యాయసాయాన్ని అందించేందుకు 1987లో న్యాయ సేవాధికార సంస్థ ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా పేదలకు ఉచితంగా న్యాయసాయం అందిస్తున్నట్లు తెలిపారు. డీటీ విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ పెంచల శ్యామ్, ఏఎస్సైలు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఆటోల దూకుడు



పొదలకూరు: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ఆటోల దూకుడుకు ఆర్టీసీ కుదేలు అవుతోంది. బస్సులు సకాలంలో రాకపోవడంతో ప్రమాదమని తెలిసినా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. సాధారణంగా బుధ, గురు, శనివారాల్లో బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకు తగిన విధంగా ఆర్టీసీ బస్సులు నడపకపోవడం..ఆర్టీసీ కంట్రోల్‌పాయింట్ లేకపోవడంతో ఆటో డ్రైవర్లు విచ్చలవిడిగా బస్టాండ్‌లోపలికి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. దీంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ పడిపోతోంది. ఆర్టీసీ బస్సులు వస్తే ఒకేసారి నాలుగైదు రావడం, లేకపోతే గంటల తరబడి లేకపోతుండడంతో ప్రయాణికులు విసిగిపోయి ఆటోలను ఎక్కి నెల్లూరుకు చేరుకుంటున్నారు. ఈ పరిస్థితి ఎంతో కాలంగా కొనసాగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చొరవచూపి బస్సుల సమయాలను ప్రయాణికులకు అనుకూలంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ



కోవూరు: కోవూరు స్టేషన్‌లో ఎస్సై–2గా మాదగాని రమ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆమె బదిలీపై కోవూరుకు వచ్చారు. నూతన ఎస్సై నెల్లూరులోని నివాసంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇందుకూరుపేట: మండల ఎస్సైగా ఎం వెంకటరాజేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు మూడో నగర స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇందుకూరుపేటకు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న సీహెచ్ వాసు మూడో నగర స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైకు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడారు. నోటిఫికేషన్‌ను విడుదల చేసి, మెరిట్ జాబితాను ఆన్‌లైన్లో ఉంచినా, సదరు పోస్టులను భర్తీ చేయలేదని చెప్పారు. దీనిపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, నగరాధ్యక్షుడు శివమ్ వర్మ, సభ్యులు అబ్రహాం, జమాల్, నేతలు మౌళి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వెంకటాచలం: పుంజులూరుపాడులో జగనన్న స్టిక్కర్‌ను అంటిస్తున్న నాయకులు



ముత్తుకూరు: శేషారెడ్డి కాలనీలో..

కొడవలూరు: పేదల సంక్షేమం కోసం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య పేర్కొన్నారు. బసవాయపాళెంలో సర్పంచ్ పెళ్లేటి రజని ఆధ్వర్యంలో నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదలకు ఆర్థిక తోడ్పాటునందించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెళ్లేటి సతీష్‌రెడ్డి, దువ్వూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ మహిధర్, దీప, నిలీష్, మౌళి, తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: పంటపాళెం సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మారు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు సంగా చెంగారెడ్డి, తుంగా శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కొండంత అండగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు కాటదెన మోహన్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని పుంజులూరుపాడులో బుధవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. పంజులూరుపాడులో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సీజేఎఫ్ఎస్ భూముల సమస్యను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించి పేద రైతుల చిరకాల కోరికను నెరవేర్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాటదెన విజయభాస్కర్‌నాయుడు, రావి బాలకృష్ణయ్యనాయుడు, సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సనాయుడు, రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : మండలంలోని మరుపూరులో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సర్పంచ్ నాగయ్య, సచివాలయ కన్వీనర్లు ప్రసాద్, కుమారి, గృహసారథులు లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండలం, నగర పంచాయతీ పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.



కొడవలూరు: బసవాయపాళెంలో..



పొదలకూరు: మరుపూరులో ..



బుచ్చిరెడ్డిపాళెం: ఇస్కపాళెంలో..